సహారా క్రికెట్ విజేత బ్రదర్స్-11


విజేతలతో ఖాలేద్ అలీఖాన్ తదితరులు

గోల్కొండ: క్రికెట్‌కు యువకుల్లో మంచి ఆదరణ ఉందని మజ్లిస్ సీనియర్ నాయకుడు ఖాలేద్ అలీఖాన్ అన్నారు. ఎంఎస్ సహారా, సహారా క్రేష్ వారు నిర్వహించిన రెండవ ఎంఎస్ సహారా లీగ్ పోటీలు టోలిచౌకీ లియో క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం ముగిశాయి. ఈ టోర్నీలో బ్రదర్స్-11 టీమ్ విజేతగా నిలిచింది. గోల్కొండ బ్లాస్‌తో జరిగిన ఫైనల్‌లో బ్రదర్స్-11 టీమ్ 17 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. బ్రదర్స్-11 టీమ్ 118 పరుగులు చేయగా గోల్కొండ బ్లాస్ టీమ్ 82 పరుగులకే కుప్పకూలింది. బ్రదర్స్-11 టీమ్ కెప్టెన్ రసూల్ అజయంగా 33 పరుగులు చేయడమేకాకుండా మ్యాచ్ కీలక దశలో ఉన్న సమయంలో మూడు వికెట్లు సాధించాడు. ఈ సందర్భంగా ఖాలేద్ అలీఖాన్ మాట్లాడుతూ..స్థానిక యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈ లీగ్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

ఏఎంఎస్ విధానంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి


మంత్రితో పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏఎంఎస్ విధానం అంతా అవినీతి మయమైపోయిందన్నారు. ఈ మేరకు శనివారం నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఏఎంఎస్ విధానం ప్రక్రియ సమయం అయిపోయినా వాటర్ బోర్డులోని కొంత మంది సీజీఎంలు తిరిగి అదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. వెంటనే వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతారని చెప్పారు.

కాంగ్రెస్ ప్రజల పార్టీ


మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం కురాకుల కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్ ప్రజల పార్టీ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ శనివారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని పాలిస్తుందని అయితే గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆ పార్టీ పెద్దల కోసమే పని చేసిన పార్టీ అని అన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అయితే నేడు ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తెలంగాణలోని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు.

భారతదేశం శాంతి సామరస్యాలకు మార్గదర్శకం



విజయనగర్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

విజయనగర్‌కాలనీ: ప్రపంచ దేశాలలో భారతదేశం శాంతి సామరస్యాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని సెయింట్‌ఆన్స్ బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఆరోగ్యమేరి దివ్య, కరస్పాండెంట్ సిస్టర్ రోజీ ఫ్రాన్సిస్ అన్నారు. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యూఎన్‌ఓ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం విజయనగర్ కాలనీ సెయింటఆన్స్ గర్ల్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో ప్రజలందరూ శాంతి సామరస్యంతో మెలగాలని విజయనగర్‌కాలనీ వీధుల్లో ప్లకార్డులు, బ్యానర్లు చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రాబ్యాంక్, మల్లేపల్లి ఐటీఐ, యానిమల్ హస్పెండరి, ప్రభుత్వ వెటర్నరి ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యార్థుల పెద్ద ఎత్తున నిర్వహించిన ర్యాలీ ప్రజలను ఆలోచింప చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి దివ్య మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నింటిని ఏకతాటిపై నడిపించేందుకు యూఎన్‌ఓ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

పీస్ అండ్ మైత్రి కమిటీలను మరింత బలోపేతం చేయాలి


నగర కొత్వాల్‌తో మాట్లాడుతున్న ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీలను మరింత బలోపేతం చేయాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గోల్కొండ యూత్ కాంగ్రెస్ నాయకుడు, గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుడు ఇమ్రాన్ అలీఖాన్ శనివారం నగర కొత్వాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కొత్వాల్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీస్ అండ్ మైత్రి కమిటీల్లో యువత భారీ సంఖ్యలో చేరాలన్నారు.

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

గోల్కొండ: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎంజేపీ డైరీ ప్రొడక్ట్స్ చైర్మన్ మహ్మద్ అఫ్జల్ అన్నారు. గత రెండు దశాబ్దాలుగా నిరుపేదలకు అండగా ఉంటూ వారికి కష్టకాలంలో ఆదుకుంటున్న తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఆయన ఎండిలైన్స్‌లోని ఆయన కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవకు తమ అండ ఎప్పుడూ ఉంటుందన్నారు. మహ్మద్ మునావత్ తదితరులున్నారు.


మహ్మద్ నజీబ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మహ్మద్ అఫ్జల్

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి అదృశ్యం

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువకుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్ చాంద్ కుమారుడు షేక్ హబీబ్ అలియాస్ షేక్ అబ్దుల్ రజా (19) బేగంబజార్‌లోని సుజికీ షోరూంలో పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 1న ఉదయం 11 గంటలకు అబ్దుల్ రజా ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానికులు, పని ప్రాంతాల్లో వెతకగా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వ్యాధితో బాధపడుతూ..

మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సరస్వతీనగర్ ప్రాంతానికి చెందిన ఎం.సంతోష్ (15) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా గత నెల 31న మధ్యాహ్నం 2 గంటలకు సంతోష్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చెప్పకుండా వెళ్లి...

తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖలీల్ (19) గత నెల 31న ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి పుట్టిన రోజుకు వెళ్లి...

ఓ యువతి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మదీ బేగం (20) గత నెల 30న స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకని ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


షేక్ హబీబ్


సంతోష్


సయ్యద్ ఖలీల్


మహ్మదీ బేగం

మహాత్మా.. మన్నించు!



బస్టాప్‌లో మద్యం సేవిస్తూ..

- మద్యం సేవించి ఆ బాటిళ్లను బాపూఘాట్‌లోకి విసురుతున్న వైనం
- సాయంత్రం అయితే చాలు విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు
- పర్యాటక శాఖ నిర్లక్ష్యంతో బాపూఘాట్ పర్యవేక్షణ గాలికే..

తాగుబోతులకు అడ్డాగా బాపూఘాట్ నూతన బస్టాప్

లంగర్‌హౌస్: తాగుబోతులు చెలరేగిపోతున్నారు. ఏకంగా బస్టాప్‌లో మద్యం సేవించడమే కాకుండా ఆ సీసాలను బాపూఘాట్‌లోకి విసిరేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు కొందరు జంటలు అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రయాణికులకు ఇబ్బందిగా మారారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తున్నారు. ఈ దౌర్భాగ్య పరిస్థితులు లంగర్ హౌస్‌లోని మహాత్మాగాంధీ స్మారక బాపూ సమాధి, బాపూఘాట్ వద్ద నెలకొన్నాయి. పర్యాటక శాఖ బాపూఘాట్‌ను పరిరక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో బాపూసమాధి పవిత్రత దెబ్బతింటోంది. ప్రపంచ దేశాలు సైతం బాపూసమాధిని పవిత్ర ఆలయంగా భావిస్తాయని, కానీ మనం జాతిపితకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటు గాంధేయవాదులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌస్‌లో ప్రధాన బాపూనగర్ బస్‌స్టాప్‌ను వ్యాపారుల గొడవలతో అక్కడ నుంచి వేరొక ప్రాంతానికి గత జూలైలో మార్చారు. అయితే నూతనంగా మార్చబడిన బాపూఘాట్ బస్టాప్ తాగుబోతులకు అడ్డాగా మారింది. ఏకంగా మిట్టమధ్యాహ్నం మహిళలతో కొందరు మద్యం సేవిస్తున్నారు.



బాపూఘాట్ లోపల మద్యం సీసాలు

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా..

ఇటు బాపూఘాట్ లోపల మద్యం సీసాలు నిండుతుండటంతో బాపూఘాట్ పవిత్రత దెబ్బతింటోంది. మరోవైపు బాపూఘాట్ బస్టాప్‌లో పాటు బాపూఘాట్ చుట్టూ అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మద్యం సేవించి బస్టాప్‌లోనే నిద్రిస్తున్నారు.

పర్యాటక శాఖ నిర్లక్ష్యం..

బాపూఘాట్ బస్టాప్ వద్ద సాయంత్రం అయితే చాలు ప్రయాణికులు నిలబడటానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో కూడా వీరిపై తాగుబోతుల దాడులు జరుగుతున్నాయి. గతంలో పర్యాటక శాఖ ఇక్కడ బాపూఘాట్ నిర్వాహనకు సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం వారిని తొలగించి బాపూఘాట్ పరిరక్షణ బాధ్యతను 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న తారామతి బారాదరి ఇన్‌చార్జికి అప్పజెప్పారు. వారు కనీసం వారంలో ఒకరోజు కూడా ఇటు తొంగి చూడటంలేదు. ఆర్టీసీ అధికారులు బస్టాప్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని, పర్యాటక శాఖ అధికారులు బాపూఘాట్‌ను పరిరక్షిస్తూ పవిత్రతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సాయంత్రం అయితే చాలు వీరి ఆగడాలకు అంతులేదు. రాత్రి ఇక చెప్పలేని పరిస్థితి. ఇక బాపూ సమాధికి ఉన్న ఏటవాలు ప్రహరీ కింద రాత్రిళ్లు వ్యభిచారం కొనసాగుతుంది.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం


వెంకటేశ్ గౌడ్ ఏడీఈ

శాలిబండ: మీరాలం సబ్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మీరాలం ఏడీఈ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా..మీటర్, బిల్లింగ్, విద్యుత్ స్తంభాలు, వైర్లు, బిల్లుల్లో సమస్యలు, సరఫరాలో సమస్యలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయాలన్నారు. అత్తాపూర్, కిషన్‌బాగ్, చందులాల్ బారాదరి, మీరాలం సెక్షన్ పరిధిలోని వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎంను కలిసిన తెలుగు వర్సిటీ వీసీ



నాంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం నూతన ఉపాధ్యక్షులను నియమించింది. ఇందులో భాగంగానే వెలుదండ నిత్యానందరావు సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు



చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని టీఎస్. బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

నెల రోజుల పాటు ఆకాశ దీపం పూజా కార్యక్రమాలు


ఆకాశ దీపం పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చార్మినార్: కార్తీక మాసం సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో నెల రోజుల పాటు ప్రతిరోజూ ఆకాశ దీపం పూజా కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి ఈ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు సహస్ర దీపాలంకరణ సేవ, మహా అన్నకూట్ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 7:15 గంటలకు జరిగే ఈ ఆకాశ దీపం పూజా కార్యక్రమాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

అనువాద గ్రంథం ఆవిష్కరణ


అనువాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర మిత అయ్యంగార్ (నిత్య వైష్ణవ) సంఘం హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య రచించిన ఆణిముత్యాలు అనే తెలుగు గ్రంథాన్ని, సంస్కృత అకాడమీ హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య పెన్నా మధుసూధన్ అనువాదం చేసిన ఆంగ్ల గ్రంథం 'జెమ్స్ ఆఫ్ వేదిక్ విజ్‌డమ్' గ్రంథావిష్కరణ, అంకితోత్సవం సభ శనివారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు హాజరై అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కృతిని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచార్య స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త పెరుంబుదూరు శ్రీరంగాచార్య, శ్రీ వైష్ణవ సేవా సంఘం సలహాదారు శ్రీమాన్ చిలుకమర్తి లక్ష్మీనాథాచార్య, సభా సంచాలకులు శ్రీమాన్ తిరుక్కోవెల సత్తయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఆలయంలో అద్దాల మండపం

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఓ ఆలయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగిన ఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 10:30 గంటల సమయంలో ఆకస్మాతుగా అద్దాల మండపంలో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదు. ఘటన స్థలానికి చేరుకున్న విద్యుత్ అధికారులు పరిశీలించగా..ఎలక్ట్రిక్ వైర్లు పాతవైపోవడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని తెలిపారు. ఆలయానికి చేరుకున్న సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌లు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ వీరేంద్రబాబు యాదవ్, నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్‌మిల్ వద్ద గల కోవెల రంగనాయక స్వామి ఆలయంలో శివ లింగ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు భారీ ఎత్తున జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.నర్సింహ, సోమారపు జనార్దన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం


మెట్టు రాఘవేంద్రను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, టీటీడీ అడ్వైజరి కమిటీ మాజీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర పేర్కొన్నారు. నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరించి ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. శనివారం గోషామహల్ ఆగాపురా ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు స్థానికులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెట్టు రాఘవేందర్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మెట్టు శ్రీకాంత్, మెట్టు విజయ్‌కుమార్, ఆల్ ఇండియా ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్



నాంపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను తన నివాసంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

దేవేందర్ యాదవ్ మెమోరియల్ క్రీడా పోటీలు ప్రారంభం


స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్ మహ్మద్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి కృష్ణ యాదవ్

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల మైదానంలో అథ్లెటిక్ కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో 34వ సి.దేవేందర్ యాదవ్ మెమోరియల్ రన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ మాట్లాడుతూ..ప్రతియేటా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, ప్రొఫెసర్ రాజేష్, కోచ్ ఫొటోగ్రాఫర్ మహ్మద్ వహియుద్దీన్ పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ కేంద్ర సంఘం నాయకులకు సన్మానం


మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్

అబిడ్స్: టీఎన్జీఓస్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీలను ఘనంగా సన్మానించారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కొండారెడ్డిని టీఎన్జీఓస్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఇతర పలు జిల్లాల నాయకులు అశోక్, శ్రీకాంత్, రుగేష్, సుదర్శన్, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, షాబోద్దీన్ వారిని సన్మానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సందడిగా సదర్



ఎంపీ అనీల్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

అబిడ్స్/అఫ్జల్‌గంజ్: సదర్ వేడుకలు అబిడ్స్‌లో జోరుగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో దున్నరాజులతో విన్యాసాలు చేయించి సంబరాలు చేశారు. మంగళ్‌హాట్, గుఫానగర్, ఆసిఫ్‌నగర్, సీతారామ్‌బాగ్, జాంబాగ్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేడుకలు చేపట్టారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్ సదర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ యాదవ్‌ను నిర్వాహకులు సత్కరించారు.

గోల్కొండ: సదర్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కార్వాన్, గుడిమల్కాపూర్, గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో యాదవ సంఘాల వారు సదర్ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించారు. యాదవ సోదరులే కాకుండా డైరీ ఫామ్‌ల నిర్వాహకులు తమతమ దున్నలను అందంగా అలంకరించి వీధుల్లో ఊరేగించి సదర్ వేడుకలు జరిగే చౌరస్తాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా యజమానులు తమ దున్నలతో ఒళ్లు గగురుపరిచే విన్యాసాలు చేశారు.


వేడుకల్లో దున్నరాజులతో గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు జి.శ్రీనివాస్ యాదవ్


గుఫానగర్ సదర్ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు మనోహర్ గైక్వాడ్ తదితరులు.


వేడుకల్లో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ తదితరులు